క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన చిన్నారి చీకట్ల సిద్ధిక్ వైద్య చికిత్సకు ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.5.60 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. సిద్ధిక్ అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి మల్లారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, పసుల వెంకటేశ్వర్లు, కలకోళ్ల పోషయ్యలు ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆదివారం ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



జనగామ రూరల్ : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జనగామకు చెందిన మిత్రులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మల్లన్న గండి రిజర్వాయర్ వద్ద మిత్రులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఏళ్లు గడిచిన స్నేహం మరిచిపోనిదని కష్టసుఖాల్లో తోడుగా ఉండాలి కోరారు. మాజీ కౌన్సిలర్ గాదెపాక రాంచందర్, మేడ శ్రీనివాస్, మళ్లీగారి రాజు, బొట్ల శేఖర్, ఉడుగుల సాగర్, ఏలేష్, గడిపే రాజు, తోకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి టౌన్ : మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన కన్న గట్టయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆదివారం పాలకుర్తి అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కార్యదర్శి జీడి హరీష్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగావకాశం కల్పించాలి



పాలకుర్తి టౌన్ : పేదరికంతో బాధపడుతున్న తమ కుటుంబానికి ఉద్యోగావకాశం కల్పించాలని మండల కేంద్రానికి చెందిన కొంగ సంధ్య, సోమేశ్వర్ దంపతులు సీఎంకు, గవర్నర్‌కు లేఖ రాశారు. తమకు ఇద్దరు కుమార్తెలు జన్మించిన అనంతరం 2014, సెప్టెంబర్ 26న పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఫెయిల్ కావడంతో మరో బాబు, పాప జన్మించారని తెలిపారు. అప్పటి కలెక్టర్‌కు న్యాయం చేయాలని వినతిపత్రం ఇవ్వగా ఉపాధి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ అమలు చేయలేదన్నారు. నలుగురు సంతానంతో కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందిగా ఉందని ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం ఇవ్వాలని సీఎం, గవర్నర్‌కు లేఖ రాసినట్లు ఆదివారం తెలిపారు.

అభినందన

జనగామ రూరల్ : స్టేషన్ ఘన్‌పూర్ మండలం విశ్వనాథగూడెనికి చెందిన మాచర్ల కృష్ణవేణి ఇటీవల ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో భారత్ తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించడం అభినందనీయమని తెలంగాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో కృష్ణవేణి మెడల్ సాధించారని, కలెక్టర్ రిజ్వాన్ బాషా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి పంద్రాగస్టు వేడుకల్లో గౌరవ సత్కారం అందించి ప్రభుత్వ పరంగా ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.

సన్మానం

రఘునాథపల్లి : మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్–లక్ష్మి దంపతుల కుమారులు ప్రణయ్‌కుమార్ ఐఏఎస్‌గా ఎంపికై నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొయ్యడ ఉదయ్‌కుమార్ గ్రూప్–1 ఆఫీసర్‌గా ఎంపిక కావడంతో ఆదివారం స్థానిక నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. మండలంలోని నిడిగొండలో గల నివాసంలో అన్నదమ్ములతోపాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు.

చలో ఢిల్లీ ధర్నాను జయప్రదం చేయండి

పాలకుర్తి టౌన్ : తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని చేపట్టిన చలో ఢిల్లీ ధర్నాను జయప్రదం చేయాలని ఓబీసీ రాష్ట్ర కోర్డినేటర్ పులి గణేష్‌గౌడ్, ఓబీసీ సెల్ నాయకుడు, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. టీపీసీసీ పిలుపు మేరకు ఈనెల 6వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 7న రాష్ట్రపతికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమవారం చర్లపల్లి నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు, బీసీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

సాగునీటి కాల్వలపై నిర్లక్ష్యం

- ముళ్లపొదలు, పూడికతో నిండిన కాల్వలు
- పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపూర్ శివారులో ముళ్లపొదలతో నిండిన కాల్వ

రఘునాథపల్లి : నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ముళ్లపొదలతో కాల్వలు కనుమరుగవుతున్నాయి. మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాల్వ నుంచి యాదాద్రి జిల్లాకు వెళ్లే మెయిన్ కెనాల్ నుంచి ఇబ్రహీంపూర్‌కు వెళ్లే కాల్వలు పలు చోట్ల ముళ్లపొదలతో మూసుకుపోయి నీరు రాని పరిస్థితి నెలకొంది. కాల్వ ఓ వైపు కొందరు రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నా ఆ వైపు అధికారులు చూసిన పాపాన పోలేదు. కాల్వలు ఆక్రమణకు గురవుతున్నాయని, ముళ్లపొదలతో పూడుకు పోయాయని అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా కాల్వకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో ముళ్లపొదలు, చెట్లు, చెత్తా చెదారంతో నిండి చివరి ఆయకట్టు భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రధాన కాల్వకు నీరు విడుదల చేయగా సాగుకాల్వలకు సరిగా నీరు రావడం లేదు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా స్పందించలేదు. ఉన్నతాధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించి సాఫీగా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీసీల రాజ్యాధికారమే ధ్యేయం



నర్మెట: సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ



కొడకండ్ల: మాట్లాడుతున్న వెంకట్‌యాదవ్

- జిల్లా కన్వీనర్ రామకృష్ణ

నర్మెట : బీసీలను చైతన్యం చేసి రాజ్యాధికారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని మన ఆలోచన సాధన సమితి జిల్లా కన్వీనర్ గునిగంటి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో సాధన సమితి జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కటకం నర్సింగారావు ఆధ్వర్యంలో ఆవిర్భవించిన పార్టీ సిద్ధాంతాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లి బీసీల హక్కుల సాధనకు సమష్టిగా పోరాడాలని తెలిపారు. జిల్లా నాయకుడు పన్నీరు సత్యం, ప్రజ్ఞాపురం శ్రీధర్, కందకట్ల శ్రీనివాస్, బొల్లు ఉప్పలయ్య, శివ, గోపాలాచారి, తిరుపతి పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి

కొడకండ్ల : రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీ వర్గాలు ఏకమై పోరాటం చేయాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఆవుల వెంకట్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కులాలు, పార్టీలకు అతీతంగా బీసీలంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. బీసీల్లో చైతన్యం, ఐకమత్యాన్ని తీసుకొచ్చి రాజ్యాధికారమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి కృషి చేస్తోందన్నారు. ఇందులో బీసీ కులాల వారంతా కలిసి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కోటేశ్వర్, శ్రీనివాస్, కమలాకర్, శ్రీనివాస్, నాగరాజు, జనార్దన్, తుమ్మ గోవర్ధన్, రవి, రామకృష్ణ, వెంకన్న, లక్ష్మణ్, భాస్కర్, విష్ణు, నరేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



తనిఖీ చేస్తున్న ఎస్సై హమీద్

బచ్చన్నపేట : మద్యం తాగి వాహనాలు నడపొద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, అందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలకు తప్పకుండా ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్‌లను తప్పకుండా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



దేవరుప్పుల : రైతులకిచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పయ్యావుల భిక్షపతి కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న మండలంలోని ధర్మాపురం గ్రామంలో జరిగే సంఘ మండల మహాసభ కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. భిక్షపతి మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. నాయకులు కొత్త ఉప్పలయ్య, మల్లయ్య, యాదవరెడ్డి, పరుశ రాములు, నర్సయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

‘పింఛన్లు పెంచి ఆదుకోవాలి’

దేవరుప్పుల : దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్ పెంచి ఆదుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మగడ్డ తండాలో భూక్య యాకూబ్ అధ్యక్షతన పింఛన్‌దారుల చైతన్య సమావేశం నిర్వహించారు. పింఛన్ పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా పెంచకుండా ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే దివ్యాంగులకు రూ.6,000 వృద్ధులకు, ఇతరులకు రూ.4,000లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిచో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈనెల 13న ఎల్బీ స్టేడియంలో జరిగే వికలాంగుల సింహగర్జన సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోరిబా, ఉపాధ్యక్షుడిగా బూ డిద శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా భూక్య దస్రు, కో శాధికారిగా బూడిద యాదమ్మ, ఆకుల యాదమ్మ స్వరూప, గుగులోత్ చావలిని ఎన్నుకున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

కొడకండ్ల : తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందగా తోటిస్నేహితులు వారి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా బాధితులకు ఆర్థిక సాయం అందించి మిత్ర బంధాన్ని చాటుకొన్నారు. మండలంలోని మైదంచెరువు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బానోత్ తండాకు చెందిన బానోత్ జాంబ ప్రైవేట్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మిత్రుడి ఆకస్మిక మృతితో ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి తమవంతుగా చేయూతనివ్వాలనే సంకల్పంతో మొండ్రాయి ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు వాట్సాప్, సోషల్‌మీడియా ద్వారా రూ.68 వేలు జమచేసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శ

నర్మెట : హన్మంతాపూర్ గ్రామానికి చెందిన ఉడుత రాకేష్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా నర్మెట టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్ ఆదివారం పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి గంగం ట్రస్టు ద్వారా బియ్యం, సరుకులను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



చీర నేస్తూ ఊరేగింపుగా వెళ్తున్న పద్మశాలీలు



నృత్యాలు చేస్తున్న శివసత్తులు

జఫర్‌గఢ్ : శ్రావణమాసం సందర్భంగా జఫర్‌గఢ్‌లో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మతల్లి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో భాగంగా శివసత్తులు, పూనకాలతో నృత్యాలు చేశారు. అనంతరం పాతురులోని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పద్మశాలీలు మగ్గంపై నేసిన చీరను ఊరేగించి పోచమ్మతల్లికి సమర్పించి భక్తిని చాటుకున్నారు. ముదిరాజ్ కులస్తులు, మహిళలు పెద్దమ్మతల్లికి బోనాలతో సమర్పించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన పిండి తిరుమలేష్ మృతితో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో తిరుమలేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాసూ(?)రి కుమార్ మాట్లాడారు. తిరుమలేష్ పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలు అందించారని, ఆయన ఇటీవల గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. పాఠశాల యాజమాన్యం అతడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆరోగ్య, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, క్లిష్ట పరిస్థితుల్లో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దామెర వేణు, జిల్లా నాయకులు వేళ్ల సురేందర్, మండల నాయకులు అలిమి మధు, బైరి అశోక్, కలకోల రమేష్, వ్యాసబట్టు గిరిధర్‌రాజ్, బలబద్ర రవీందర్, రమేష్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

రఘునాథపల్లి : మండలంలోని అశ్వరావుపల్లి శివారులో గల గుప్త ప్రసన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు మురళి, అర్చక పరివారిక బృందంచే అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్లపల్లి హరికళాధర్‌రావు–హరిప్రియ దంపతుల ఆధ్వర్యంలో సుందరకాండ హోమం నిర్వహించారు. నేడు వార్షికోత్సవ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇన్‌చార్జ్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

పల్లగుట్ట చింతల చెరువుకు మత్తడి



చిల్పూరు: మత్తడి వద్ద ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



లింగాలఘణపురం: పాలాభిషేకం చేస్తున్న మాజీ జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి తదితరులు

చిల్పూరు : మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేయడంతో పల్లగుట్ట గ్రామంలోని చింతల చెరువు నిండి మత్తడి పోస్తోంది. దీంతో ఆదివారం చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా సరైన వర్షాలు లేకపోవడంతో చెరువుల్లో నీరు లేక పంటలు సాగుచేసిన రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా చెరువులు నింపాలని ఆదేశించారు. దీంతో ఆదివారం వరకు ఫత్తేపూర్, కృష్ణాజీగూడెం, చిల్పూరు, పల్లగుట్ట గ్రామాల్లోని చెరువులు నిండి మత్తడి పోశాయి. కార్యక్రమంలో ఎడవెల్లి మల్లారెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, గనగోని రమేష్, మహ్మద్ షకీల్, రత్నాకర్ రెడ్డి, ఎన్నకూస కుమార్, బొట్టు చేరాలు, ఇసురం కృష్ణ, కుంచాల సంపత్‌రాజు, బాసెట్టి జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కడియం కృషితోనే చెరువుల్లోకి జలాలు

లింగాలఘణపురం : ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితోనే నియోజకవర్గంలోనే చివరి గ్రామమైన జీడికల్ దేవుని చెరువులోకి గోదావరి జలాలు చేరాయని మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని జీడికల్ దేవుని చెరువుకి చేరిన గోదావరి జలాల్లో పూలుచల్లి పూజలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే విధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంతో కృషి చేస్తున్నారని, అందులో భాగంగా ఏడాదిగా కష్టపడి జీడికల్ దేవుని చెరువులోకి నీళ్లు అందించారని అన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మూర్తి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, మార్కెట్ డైరెక్టర్ మోహన్, కొండబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కొమురెల్లి, మండల అధ్యక్షుడు

పాలకుర్తి : మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా రాఘవాపురం మాజీ సర్పంచ్ రాగం కొమురెల్లిని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య ప్రకటించారు. ఆదివారం పాలకుర్తి మండలంలోని వల్మిడికి చెందిన వీరమల్ల బాబురావు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మారపల్లి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా సుతారి శ్రీనివాస్‌లను నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజు పేర్కొన్నారు.

పొక్లెయినర్ ఓనర్స్ అసోసియేషన్ సంఘం..



మురళీధర్‌రావు, మండల అధ్యక్షుడు

పాలకుర్తి టౌన్ : పొక్లెయినర్ (ఎక్స్‌కవేటర్) ఓనర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా బొంపల్లి మురళీధర్‌రావు ఆదివారం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా వర్రె వెంకన్న, వీరమనేని సోమేశ్వర్ రావు, ఉపాధ్యక్షులుగా వల్లెపు యాదగిరి, సలేంద్ర సంపత్, ప్రధాన కార్యదర్శిగా యార రాజు, సహాయ కార్యదర్శిగా వరికొప్పుల రమేష్, కోశాధికారిగా మహమ్మద్ లుక్మాన్, కార్యవర్గ సభ్యులుగా గణేష్, సతీష్, వల్లెపు సోమయ్య, వల్లెపు రాజు, సరేందర్, చింతకింది ఉపేందర్, యాకూబ్ పాషా, బొమ్మశెట్టి అశోక్ ఎన్నికయ్యారు.


సంక్షిప్త సమాచారం

కురుమ సంఘం కమిటీ ఎన్నిక



బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలోని బీరప్ప ఆలయం వద్ద ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి జై బీరప్పకామరాతి కురుమ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా (పెద్దకురుమ) బేజాడి రామచంద్రం, ఉపాధ్యక్షుడిగా (సారికురుమ) నోముల గంగయ్యను ఎన్నుకున్నారు. నాయకులు బేజాడి సిద్ధులు, బీరప్ప, సిద్దిరాజేశ్వర్, నాగరాజు, గోపాల అంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

టాస్కా పట్టణ కమిటీ ఎన్నిక



జనగామ రూరల్ : పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు టి.సిద్ధి మల్లయ్య ఆధ్వర్యంలో టాస్కా (తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లగిశెట్టి వీరలింగం, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ జబ్బర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు అర్బన్ సభ్యులు సహకారంతో సభ్యత్వాన్ని పెంచాలని తీర్మానించారు. జిల్లా ఆడిట్ కమిటీ అధ్యక్షుడిగా హరిబాబును నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పట్టణ స్వర్ణకార సంఘం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



జనగామ పట్టణ స్వర్ణకార సంఘం ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు ఆదివారం సంఘం కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా వలబోజు చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా కందుకూరి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సరాబోజు ఆంజనేయులు, కోశాధికారిగా ఎర్రోజు శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శి, పోత్కనూరి కనుకచారి బాధ్యతలు స్వీకరించారు. సంఘం అభివృద్ధికి స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని అన్నారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం గౌరవ సలహాదారుడు నారోజు రామేశ్వరచారి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు,సమితి సభ్యులు

జనగామ రూరల్ : గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జి నిర్మించాలని న్యాయవాది రాగల్ల శ్రీహరి అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఏడోరోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు జనగామ న్యాయవాదులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిది నెలల్లో వంతెన పనులు పూర్తి చేయని గానుగుపహాడ్ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీటకోడూర్ వంతెన పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, న్యాయవాదులు, చెరుకూరి కనకయ్య, కందగట్ల శ్రవణ్ కుమార్, జంజాల అభిషేక్, దడిగె సందీప్, మాదిగ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గొంగల్ల కుమార్, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బచ్చన్నపేట : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా చేయాలని అచల యోగా ఫౌండేషన్ ప్రతినిధి, యోగా గురువు మల్లేశం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా చేస్తే మానసిక ప్రశాంతతతో పాటు శారీరదారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అచల యోగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ స్వామి ఆదేశాల మేరకు ప్రతి రోజు యోగా తరగతులు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు యోగా క్లాసులను వినియోగాంచుకోవాలని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ : 9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎస్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)